ఈ . వా ర ం . క థ

# తెగిపోయిన పాట

## టులెట్ బోర్డు అతన్ని ఆపింది.

**చేతికి బరువుగా వేలాడుతున్న సూట్‌కేస్,**

**కొద్దిగా మాసివున్న బట్టలు,**

నిర్లక్ష్యంగా ఎగురుతున్న జుట్టు. ఏ భావమూ లేని మొహం.

కిర్రుమంటూ గేటు తెరుచుకుంది. మంచులో స్నానం చేసి ఆడుకుంటున్న పసిపిల్లల్లాంటి లేతగులాబీలు. ఆప్యాయంగా నిమిరాడు. అతని కళ్లలో చిన్న పిల్లాడి సంతోషం.

అతన్ని చూడగానే నిలువెత్తు కుక్క గొలుసులు తెంచుకోడానికి విశ్వప్రయత్నం చేసింది.

దాని గొంతులో కోపపు గురక! నాలుక పీలికలు కాని జ్వాల! అతను నిర్లిప్తంగా కుక్క వైపు చూసి, కాలింగ్ బెల్ నొక్కాడు. ఇంటి వోనరు తలుపు తీశాడు.

"గది అద్దెకు కావాలి"
"ఇక్కడ కాదు, మేడపైన"
... మేడపైన గది తలుపు తెరుచుకుంది.
ఫ్లోరింగ్‌పై దుమ్ము పొర
వలను జాగ్రత్తగా పరిశీలించుకుంటున్న సాలీడు!

"ఊరికి దూరమన్న మాటేగాని, ఇక్కడ దొరికే ప్రశాంతత సిటీలో దొరుకుతుందా చెప్పండి. అద్దె రెండొందలు. బాత్‌రూం కిందే వుంది..."

అతనేం మాట్లాడకుండా కిటికీలు తెరిచాడు.
దూరంగా నగరం - పెయింటింగ్‌లోని దృశ్యంలా
అప్పుడే పుట్టిన లేత శిశువులా - ఎండ.
"రెండు నెలల అడ్వాన్స్ కూడా ఇవ్వాలి. ఏమిటీ మాట్లాడరూ?"
పర్సులోంచి డబ్బు తీసి ఇచ్చాడు.

"మీరేం చేస్తుంటారు?" డబ్బుని జాగ్రత్తగా లెక్కపెడుతూ వోనరు ప్రశ్నించాడు.

"ఫ్యాక్టరీలో మెకానిక్‌ని"

* * *

విశ్శబ్దాన్ని కదుపుతున్న గుర్ఖా విజిల్!
వేళ్ల మధ్య ఆత్మహత్య చేసుకుంటున్న సిగరెట్!
బలహీనంగా కొట్టుకుంటున్న టైంపీస్ గుండె!
స్విచ్ ఆఫ్ చేసి కళ్ళు మూసుకున్నాడు.
మనసులో చీకటి!
'కన్నా!'
తల్లి తీపి పిలుపు
శిఖరాల అంచుల్లోంచి!
అగాధాల లోతుల్లోంచి!
గుండెల్లో ఎగదన్నుకొస్తున్న దుఃఖపు బుగ్గ.
బుగ్గలను స్పర్శిస్తున్న కన్నీళ్లు.
ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు.
చీకట్లో నీడలు! అస్పష్టమైన ఆకారాలు!
ఒళ్లు విరుచుకుంటున్న జ్ఞాపకాలు!

ఆ పాట తన జీవనాదం. ఆ పాట తన కన్న తల్లి. ఆ పాట గొంతులో ఎన్నెన్ని జీవన స్మృతులు! ఆ పాట గుండెలో ఎన్నెన్ని బాధాశ్రుతులు! ఆ పాట 'రెక్కల కష్టం'



ఎంత మధురమైన తేనెను కూడ బెట్టింది? ఆ 'శ్రమ పాట'ను చెదరగొట్టి, శ్రమ ఫలితాన్ని జుర్రుకోవడం ఎంత క్రూరమైన స్వార్థం!

జి . ఆ ర్ . మ హ ర్షి

... ఏడుస్తున్న ఐదేళ్ల కుర్రాడు.
ఏడ్వాలన్నా కన్నీళ్లు లేని తల్లి.
"అన్నం వద్దు పాయసం కావాలి"
చిన్న రెక్కలు టపటప కొట్టుకుంటున్న పావురం.
తల్లి కళ్లు నీటి చెలమలు!
"రేపు తప్పకుండా మా కన్నాకు పాయసం, అంతా ఒక్కడికే! ఈ రోజుకి అన్నం తినమ్మా"
"కొత్త చొక్కా కూడా! నా చిరుగుల చొక్కాని చూసి బళ్లో పిల్లలంతా వెక్కిరిస్తున్నారు."
కట్టతెగింది! అలలు ఎగిసిపడ్డాయి.
చిరుగులకు తల్లి కన్నీళ్లే అతుకులు!
భళ్లున తలుపు తెరుచుకుంది.
గోరుముద్దలు మళ్లీ దొరకలేదు.
... మెదడులో తగలబడుతున్న అరణ్యాలు
జ్ఞాపకాలు చెరగవు
గుండెకు పొడిచిన పచ్చబొట్లు!
నిద్రలో ఉలిక్కిపడిన పసిపాప ఏడుపు
ఎక్కడో వేణువులోంచి బొట్లు బొట్లుగా రాలుతున్న విషాదం....
... రెప్పల యవనిక పైకి లేచింది.
వర్క్‌షాప్‌లో పదేళ్ల కుర్రాడు,
గ్రీజుపట్టిన బాల్యం, స్పానర్లుగా మారిన చేతులు
మొహంలో ఏ భావం లేదు.
ఎవరో పరుగెత్తుకొస్తున్న అడుగుల చప్పుడు.
పాడు.
"చంపేశాను. నా చేతులతోనే ... శవాన్ని పూరి బయట పాతి ... లేచిపోయిందని ..."
ఏదో బద్దలైన శబ్దం!
గుండెల్లోకి దూసుకొస్తున్న గాజు పెంకులు!
కూలిపోతున్న పచ్చటి చెట్లు!
తండ్రి మొహమ్మీద తుపుక్కున ఉమ్మి వెళ్ళిపోయాడు.
చీకటి! వర్షం! చెరో చేత్తో అతన్ని కౌగిలించుకున్నాయి.
తమలోకి ఇముడ్చుకున్నాయి.
... కన్నీళ్లలో దొప్పల్లా తేలుతున్న కనుపాపలు!
లేచి మరో సిగరెట్ వెలిగించాడు.
అగ్గిపుల్ల పారెయ్యబోతూ క్షణం ఆగాడు.



సారా వాసనతో తూలుతూ వచ్చింది గాలి.
ఎదురుగా మృగం; తండ్రి!
"అన్నం." మృగ గర్జన.
సుడిగాలిలో చిగురుటాకు తల్లి!
"లేదు" అతి కష్టంతో మాటను చేదింది.
"ఈ అన్నం ఎక్కడ్నుంచి వచ్చింది? ఎవడి వద్ద ..."
మృగం నోట్లోంచి కారుతున్న బూతులు.
ప్లేట్ గాల్లోకి లేచింది
గదంతా చిందరవందరగా మెతుకులు ... మృత శిశువుల్లా!
కుర్రాడు ఓ మూల భయపు ముద్దయ్యాడు.
తల్లి ఏడుపు స్పష్టంగా, తండ్రి బూతులు అస్పష్టంగా
కుర్రాడి నిద్రకు జోలపాట
రోజూ వినిపించే నేపథ్య సంగీతం!
... తెల్లవారింది
'అమ్మా!' కుర్రాడి శరీరాన్ని తొలుచుకొచ్చిన కేక
అంతా శూన్యం!
లేచిపోయిందని గుసగుసలు
కనుపాపల్లో తల్లిని ముద్రించుకొని కుర్రాడి అన్వేషణ!
కుర్రాడు తలెత్తలేదు.
"కన్నా, మీ నాన్నను ఎవరో పొడి చేశారు. ఆస్పత్రిలో వున్నాడు, వెళ్ళు తొందరగా" వగరుస్తూ చెప్పాడా వచ్చిన వ్యక్తి.
"పోయాడా?"
"లాభం లేదట"
"పని పూర్తయ్యాక వెళతాను. చావుని దగ్గర్నుంచి చూడాలని వుంది."
... ఆకాశాన్ని చీలుస్తున్న మెరుపులు!
ఆస్పత్రి కిటికీకి తలలు బాదుకుంటున్న చినుకులు.
మందంగా వెలుగుతున్న లైటు
ఫినాయిల్, రోగాలు, దుఃఖం మిళితమైపోయిన వాసన!
మంచం మీద పడుకొని వున్న బ్యాండేజి కదిలింది.
"వచ్చావా! నిన్ను చూడకుండానే పోతానని అనుకున్నా"
కుర్రాడి కళ్లలో ఆశ్చర్యం
మృగం గొంతులో మార్దవమా!
"నేను దుర్మార్గుణ్ని, నీకున్ని, మీ అమ్మను ..."
కుర్రాడి మొహంలో రక్తం పొంగింది.
"ఎక్కడుంది. మా అమ్మ చెప్పు?" బ్యాండేజిని కుదిపాడు.

ఏదో శబ్దం ... కిటికీ అవతల.
టార్చ్ వేశాడు.
గుబురుగా పెరిగిన కంప చెట్లు
టార్చ్ అటూ ఇటూ తిప్పాడు. ఆర్పేయ్యబోతూ కిటికీ పక్కన గోడని చూశాడు.
ఒళ్ళంతా గొంగళ్ళు పాకిన ఫీలింగ్!
గోడకు పెద్ద తేనెతుట్ట, వేలాది తేనెటీగలు బిలబిలలాడుతూ

* * *

వారం రోజుల తరువాత ...
కిటికీ వద్ద అతను, తేనెటీగల్ని చూపులతో తడుముతూ
అతని కళ్లలో ... ఆప్తుల్ని చూస్తున్న భావం.
నాలుగైదు తేనెటీగలు ఎగురుతూ వచ్చి అతనిపై వాలాయి.
ఒకటి చెవి వద్దకు వచ్చి తారాడింది.
కితకితగా నవ్వాడతను.
"రోజూ ఎందుకలా మమ్మల్ని చూస్తుంటావు?"
ఈగ ప్రశ్నించింది.
"మీరు చేస్తున్న పని చూడాలంటే ఇష్టం."

20-4-90

## ఈ వారం కథ

"నిన్ను చూస్తే భయం. తేనె దోచుకుంటావని, మనుషులు క్రూరులు"

"నిజమే. కాని నేను కాదు."

"నీకెవ్వరూ లేరా?"

"మీరంతా నావాళ్ళే."

తేనెటీగ గాల్లోకి రెక్కల్ని విదిలించింది.

గదిలో వున్నంతసేపూ ప్రతి అరగంటకోసారి తేనెటీగల్ని చూస్తూ అలాగే నిల్చుండిపోవడం - వారం రోజులుగా ఇదే తంతు.

ఫ్యాక్టరీలో కూడా ఆలోచనలు తేనెటీగలయ్యేవి.

వాటి పట్ల ఎందుకంత ప్రేమో - అతనికి కూడా తెలియదు.

* * *

హాహాకారాలు చేస్తున్న యంత్ర భూతాలు.

చెమటతో తడిపిన మరలు.

"తేనెలో చూర్ణం కలుపుకు తాగితే అదే మందు ..." ఎవరో సలహా ఇస్తున్నారు. అతను పని ముట్లు కింద పడేశాడు.

"తేనె ఎలా తీస్తారు?"

"పొగపెట్టి ఈగల్ని తోలుతారు"

"అవి చనిపోవా?"

"కొన్ని చనిపోవచ్చు"

చనిపోడానికి వీల్లేదు. వాటంతట అవే స్వేచ్ఛగా ఎగిరిపోవాలి. సకల ప్రాణికోటికి స్వేచ్ఛే ఊపిరి కావాలి.

కిటికీ బయటి గోడ, ఎవరికీ కనపడదు. అన్నీ కంపచెట్లు.

రిలీఫ్!

కాని అప్పుడప్పుడొచ్చే పందుల కుర్రాళ్లు!

ఏదో భయం!

పొగలో ఉక్కిరిబిక్కిరవుతున్న తేనెటీగలు!

నేలకు నిస్సహాయంగా రాలుతున్న అమాయక ప్రాణులు!

రాజుకుంటున్న భయం!

వేగంగా మేనేజర్ గదిలోకి వెళ్లాడు.

"నేను వెళుతున్నాను. సెలవు కావాలి."

"అంతా నీ ఇష్టమేనా?"

"సెలవు కావాలి" అవమానం. కోపం -

"ఇంకా చిన్న వయసు, కష్టపడితే మంచి భవిష్యత్తు, స్థిరపడొచ్చు, పెళ్ళి చేసుకోవచ్చు ... నిన్నే, వెళ్లి పోతావేం, మెమో ఇస్తాను."

పురుగులు, పేద పురుగులు

సర్వశక్తుల్ని యంత్రాలకు నైవేద్యం పెట్టే భవిష్యత్తు!

... గది తలుపులు తెరుచుకున్నాయి.

అతని కళ్లల్లో మెరుపు.

అదృశ్యమోగి గడ్డంలా తేనెటీగలు!

కొన్ని ఈగలు ఎక్కడికో ఎగిరిపోయాయి.

అవి కనిపించినంత మేరా చూశాడు, పసిపిల్లాడిలా.

* * *

"వింత మనిషివయ్యా నువ్వు, రూంకి తాళం వేయడం మరిచిపోతే ఎలా? ఏదో పని వుండి ఇటు వచ్చి చూశాను. దొంగలు పడ్డారనుకున్నాను ... పోవడానికి మటుకు ఏమున్నాయిలే. నీ రూంలోకి నేను వెళ్ళడం మంచిదయ్యింది. నిన్ని ప్రమాదం నుంచి రక్షించాను."

ఏదో అనుమానం పురుగులా పాకుతోంది.

"కిటికీ వద్ద ద్ద తేనె తుట్టె, ఒకటా రెండా కుడితే ఏమైపోతాం ... గెమాక్సీన్ విదిలించి ..."

చెవుల్లో సముద్రపు హోరు!

మెదడులో విస్ఫోటనం!

లోనికి పరిగెత్తాడు, దడేల్ మని తలుపులు తీసుకొని అంతా శిథిలం, మిగిలింది జ్ఞాపకం.

గోడమీద చార, స్మారక స్తూపం!

తుది వీడ్కోలు ఇవ్వకుండానే స్నేహితులు రాలి పోయారు.

కష్టించే చిన్ని ప్రాణాలు!

"ఇంట్లో గెమాక్సీన్ లేకపోతే, పక్కింట్లో అరువు తీసుకొని ..."

రక్తానికి బదులు మండుతున్న పెట్రోలు, కళ్లలో ప్రతిబింబిస్తున్న కార్చిచ్చు!

గడ్డం పగిలిపోయింది.

మొహంలోకి పిడికిలి దూసుకుపోయింది. ఓ మూలకు వుండలా వెళ్ళి పడ్డాడు.

రక్తం! ఉప్పగా, వెచ్చగా ...

"కొడతావా, నన్ను, నిన్ను పోలీ ..."

కంఠం చుట్టూ పిడికిలి బిగుసుకుంది.

"కదిలినా, అరిచినా చంపేస్తాను" కీచుకీచుగా, దుఃఖంగా ఆజ్ఞాపించాడు.

గబగబా బట్టలు సర్దుకున్నాడు.

చూపులు ఓనరువైపు తిరిగాయి.

"నన్నేం చేయొద్దు ..."

"గుర్తుంచుకో ప్రపంచంలోకెల్లా విలువైంది ప్రాణం, అది మనిషిదే కానక్కరలేదు."

బయటికి వెళుతూ, వెనక్కి తిరిగొచ్చాడు.

మళ్ళీ కొడతాడేమోనని ఓనరు ఓ మూలకు ఒదిగాడు.

చనిపోయిన తేనెటీగను ఒక కాగితంలోకి తీసుకున్నాడు. జాగ్రత్తగా జేబులో పెట్టుకున్నాడు.

స్మృతిని మోసుకుంటూ వెళ్ళిపోయాడు!

అతను చాలా దూరం వెళ్ళిపోయివుంటాడని నమ్మకం కుదిరాక గాని, ఓనరుకి పైకి లేవడానికి ధైర్యం చాలింది కాదు.

## తండ్రులు - కొడుకులు

ఇది పక్షి నేల కాదు ఇది ఒక దేశం
ఇది దేశం కాదు - ఒక సముద్రం
తిమి తిమింగలాలు విహారం చేసే
సముద్రం - - -
రెక్కలురాని పక్షులు బిడ్డలు
రెక్కలొచ్చిన కొడుకుల పాలి మొసళ్ళు
నేతలు!
కొమ్మల్లో అమాయకంగా వేలాడే పళ్ళు
పిల్లలు - జీవన రాక్షసి కబళాలు
తండ్రుల హాహాకారాలు నిండిన ఆకాశం
ఈ దేశం -



బాబూ! నీకు ఈ జన్మ ఇచ్చి ఎంత
గాయం చేశానో ఇప్పుడే తెలుస్తోంది
నీ రక్తం నన్ను అహోరాత్రులు శపిస్తోంది
ఏ హస్తం నీకు రెక్కలివ్వలేక పోయిందో
ఆ హస్తం తెగిపడిపోకుండా ఇంకా
ఈ శరీరాన్ని అంటుకునే వ్రేలాడుతోంది
బుల్‌బుల్ పక్షుల్లాంటి మీ బాల్యాన్ని
తుడిచివేసే హక్కు నా కెవడిచ్చాడు
ఈ దేశమనే విశాలమైన జైలులో
బేడీలు పడివున్న ఈ హస్తాన్ని
క్షమించు - - -

— శేషేంద్ర